


# క్షీరసాగర మథనం

- నిర్మలాదిత్య

*(గత సంచిక తరువాయి)*

"**బ్యాంక్ లు వాసుకి లాగా** ఈ సముద్ర మర్దనానికి, మనీ లాండేరింగ్ కు సహాయ పడుతుంది. కొంత అమృతం తెలీకుండా సేవించి, కత్తి వాటు పడి రాహు, కేతువులలాగా కల కాలం దేవతలతో బాటు జీవించే ఉంటుంది. బ్యాంకులు మనీ లాండేరింగ్ కి తోడ్పడుతూ పట్టుబడితే ఎదో డబ్బులు ఫైన్ వేస్తారు కానీ, మూసేయారు కదా", అన్నాడు విశ్వం.

"ఏంటి నాన్న మీరు ఎప్పుడు పాజిటివ్ గా ఉండే వారు, ఇప్పుడిలా మాట్లాడు తున్నారు. మీకు క్యాన్సర్ రావడం ఎంత పెద్ద సమస్య. దానిని కూడా ధైర్యంగా ఎదుర్కొని జయించారు. ఈ క్రిమినల్స్ ను దేవతలతో పోల్చడమేమిటి?", అంది లక్ష్మి.

" ఎవరు క్రిమినల్స్, ఎవరు హీరోలు ? ప్రతీ ఒక్కరు వారి కథలలో హీరోలే. ఏది తప్పు, ఏది ఒప్పు అని చెప్పడం కూడా కష్టమే. దృక్పథం బట్టి మారుతుంది. క్యాన్సర్ ను జయించడం సులభమే. కానీ, అనుభవం తో చెప్తున్నా, వీళ్ళను బయట పెట్టి శిక్షించడం అసంభవం లాంటిదే", అన్నాడు విశ్వం.

"నాకు దేవతలు ఉన్నారో లేదో తెలియదు. భగవంతుఁడు ఉన్నాడో లేదో తెలియదు. నేనో అగ్నోస్టిక్. నాకు, సమాజ వినియోగం కోసం అవసరమైన డబ్బు, తమ వంతు కట్టవలసిన టాక్స్ కట్టని వాళ్లంతా, విల్లన్ లే. వీళ్ళని బయటకి లాగుతాను", అంది లక్ష్మి దృఢ నిశ్చయంతో.

## 31

దుబాయ్

డిసెంబర్, 2014

సిద్దార్ధ్ దుబాయ్ కి వచ్చాడు. కొత్త పార్టీ పెట్టిన తరువాత, అనూహ్యమైన స్పందన లభించింది. ప్రతీ వారం ఒక్కో రాష్ట్రం రాజధానిలో మాట్లాడుతూ, దాదాపు మొత్తం భారత దేశ దర్శనం చేసేసాడు. తనకు సినిమా పరిశ్రమ వల్ల మంచి ఫ్యాన్ బేస్ ఉందని తెలుసు, కానీ ఈ వీరాభిమానం, తనకు కూడా కనువిప్పే. వీళ్ళు, తన సభలకు, మనుష్యులను పోగు

చేయడమే కాక, తన గురించి ఎవరైనా తప్పుగా మాట్లడితే వారు చచ్చేట్లు కొట్టేస్తున్నారు. తను ఈ బలంతో సభలో ఎన్ని దుర్భాషలు ఆడినా, చప్పట్లు కొట్టి ఆదరిస్తున్నారు. సభలకు వచ్చే జనాలను చూసి, మెల్లిగా కొందరు రాజకీయాలలో తల నెరిసిన నేతలు బయప్ప రెడ్డి , ఎర్రాసామి లకు తెలియకుండా, సిద్దార్ద్ ను కలవడానికి, ఏదో మిష తో డబ్బు తన పార్టీ కి ఇవ్వడానికి చూస్తున్నారు. పార్టీ డబ్బు లావా దేవిలు, పార్టీలో కొత్తగా నేతృత్వంలో చేరడానికి వచ్చే వారి మీద నిర్ణయాలు, సిద్దార్ద్ పి.ఎల్ మనుష్యులకే వదిలేసాడు. వాళ్ల మనుష్యులే ఈ కొత్త పార్టీ ఆఫీసు నడిపిస్తున్నారు. ఇదంతా పి.ఎల్ ఐడియా, చలువే కదా అని సిద్దార్ద్ కి పి.ఎల్ అంటే గురుభక్తి , అభిమానం.

అవిరామంగా లక్షల కొద్దీ అభిమానులతో, పెద్ద పెద్ద క్రికెట్ మైదానాలలో, తను ఇన్ని రోజులు ఎన్నికల ప్రచార సభలు గడిపిన తరువాత, ఈ దుబాయ్ ట్రిప్ మంచి విరామమే. దుబాయ్ కి ఎప్పుడు వచ్చినా సిద్దార్ద్ కి సంతోషమే. తనకు, దుబాయ్ లో చాలా పెట్టుబడులున్నాయి. పామ్ జుమైరా లో ఓ ఇల్లు ఉంది. ఈ మధ్యనే బుర్జ్ కాలీఫా లో ఓ అపార్ట్మెంట్ కూడా కొన్నాడు. అన్నీ స్థిరచరాస్థులు పి.ఎల్ పరిచయం చేసిన పనామా లాయర్లు, ఏవో విదేశీ కంపనీ పేర్ల మీద కొని, ఆ కంపెనీల యజమాని సిద్దార్ద్ అన్న విషయం ట్రస్ట్ కంపెనీల ద్వారా గుప్త పరిచారు.పి.ఎల్ ధర్మాన, తను దుబాయ్ లో చేసిన పెట్టుబడులన్ని, తనవని ఎవరికి తెలియదు.

వీలైనంత వరకు దుబాయ్ కి విజేత తో కాకుండా ఒంటరిగానే వస్తాడు. దాని వల్ల తనకు కావలసిన స్త్రీ సాంగత్య అవసరరాలు, తన విపరీత కోర్కెలు తీరిపోతాయి. ఇవన్నీ కప్పిపుచ్చేందుకు, తను మొదలు బెట్టిన దుబాయ్ ఫిల్మ్ ఫెస్టివల్ ఎలాను ఉంది. ఈ మిష తో తాను సంవత్సరంలో పలు సార్లు దుబాయ్ రావడానికి వీలవుతుంది. అలాగే ఈ దుబాయ్ ఫిల్మ్ ఫెస్టివల్ సిద్దార్ద్ కి చాలా ఇష్టం. దీని వల్ల సినీ పరిశ్రమ లో ఆ సంవత్సరం సినిమాలు హిట్ అయ్యి బాగా పాపులర్ అయ్యిన హీరో, హీరోయిన్ లను పిలిపించి, కలవచ్చు. ఫెస్టివల్ జడ్జి లు గా ప్రజల నాలుకలలో మెదిలే ఫ్యాషన్ డిజైనర్ లను, పారిశ్రామికవేత్తల ను, అప్పుడప్పుడు రాజకీయ నేతలను పిలిపించవచ్చు.

ఈ సారి సభ లో తను మాట్లాడడం వల్ల ఇది ఫిల్మ్ ఫెస్టివల్ నుండి, ఓ ఎలెక్షన్ సభ అవ్వుతుందేమో.

సిద్దార్ద్ దుబాయ్ పోవడం ఓ వివాదాస్పద మైన విషయమే. దానికి కారణం సిద్దార్ద్ కి ముఖ్తర్ ఖాన్ మీదున్న అభిమానం. ఖాన్ మొదటి నుంచి నేరస్తుల మార్గమే ఎన్నుకున్నాడు. అతను, అతని మనుష్యులు చేయని నేరం లేదు. రియల్ ఎస్టేట్ లో జరిగే హత్యాలలో ఖాన్ చేయి ఉండే ఉంటుంది. ఎదురొచ్చిన ప్రత్యర్ధులను అందరిని చంపేసి, అండర్ వరల్డ్ కి మకుటం లేని మహారాజు అయ్యాడు. అతనికి డ్రగ్స్ వ్యాపారంతోను, తీవ్రవాదులతోను సంబంధం ఉందని అనుమానం. ఆ అనుమానం తీరే లోపు, అతను దేశంలోని బిచాణ ను ఎత్తేసాడు. సిద్దార్ద్ కి ఖాన్ కి సంబంధాలు ఉన్నాయి, ఖాన్ లాంటి దేశద్రోహులతో సంబంధం పెట్టుకోవడం సిద్దార్ద్ ను కూడా ఓ దేశ ద్రోహి ని చేస్తుందని, టి.వి.

చానెల్స్ లోను, వార్తాపత్రికలలోను తరచు చర్చలు వస్తుంటాయి. సిద్దార్ద్ కొత్త రాజకీయ పార్టీ ఆరంభించినప్పటి నుంచి ఈ విషయం రోజుకు పలు మార్లు తల ఎత్తుతూనే ఉంటుంది. అన్ని సార్లు ఆ తల నరక డానికి, సిద్దార్థ్ ఫాన్స్ తమ వీరాభిమాన ఖడ్గాన్ని విసురుతూనే ఉంటారు.

సిద్దార్ద్ చాలా సార్లు ఖాన్ ను కలవాలని ప్రయత్నించాడు. కానీ ఇంత వరకు వీలు పడలేదు. ఖాన్ ను పిలిచిన ప్రతీ సారి సిద్దార్ద్ ఓ గిఫ్ట్ పంపించడం, దానికి బదులుగా అంత కంటే మంచి గిఫ్ట్ ఖాన్ సిద్దార్ద్ కి తిరిగి పంపించడం ఆనవాయితి అయ్యిపోయింది.

కానీ ఈ సారి ఖాన్ ను దుబాయ్ ఫిల్మ్ ఫెస్టివల్ కు ఆహ్వానిస్తే, సిద్దార్ద్ ను కలవమని, ఖాన్ సందేశం పంపించాడు. ఇలా ఖాన్ ను ఖాన్ వాళ్ళింట్లో కలవడం వివాదం అవ్వుతుందని సిద్దార్ద్ కి తెలుసు. కానీ గత కొన్ని నెలలు ఎలక్షన్ సభలలో, పార్టీ మీటింగుల లో మాట్లాడిన తరువాత ఓ తెగింపు వచ్చేసింది. ఆత్మ విశ్వాసం పెరిగి పోయింది. తనకు ఈ ఫ్యాన్ బేస్ ఉన్నంత వరకు తనపై ఓ ఈగ కూడా వాలదన్నంత నమ్మకం. రహస్యంగానే ఖాన్ ను కలిసాడు సిద్దార్ద్. అక్కడ ఖాన్ తో చర్చించిన విషయాలు రహస్యంగానే ఉంచాడు.

సిద్దార్ద్ ఖాన్ ను రహస్యంగా కలిసాడన్న మాట టి.వి. కి పేపర్లకి పాకింది. సిద్దార్ద్ మాత్రం ఏ మాత్రం ప్రతిస్పందించక, ప్రతిపక్ష పార్టీల ను వేరే అంశాలపై దుయ్యడం మొదలెట్టాడు. ప్రతిపక్ష పార్టీల పై సిద్దార్ద్ చేస్తున్న ఆరోపణలలో చాలా వరకు అబద్దాలే. సిద్దార్ద్ ను నిలదీసి అడిగితే ఋజువు చూపెట్ట లేడు. అలా ఎప్పుడైనా ఎవరైనా నిలదీస్తే వాళ్ళని చీల్చి చండాడడానికి సిద్దార్ద్ ఫ్యాన్స్, సిద్దార్ద్ ను వెంకేసుకొస్తున్న పి.ఎల్. కంపనీ వార్త పత్రికలు,టి.వి. ఛానెల్స్ ఉన్నాయి. టి ఆర్ పి రేటింగ్స్ కని టి.వి. పడుతున్న పోటీలో సిద్దార్ద్ కు మరింత ఫ్రీ పబ్లిసిటీ, ఫాలోయింగ్ దక్కింది.

మహేష్ సిద్దార్ద్, ఖాన్ ను కలవడం విని, కలవర పడితే పి.ఎల్. ఏ మాత్రం తొణకలేదు. సిద్దార్ద్ దుబాయ్ నుండి వాపసు రాగానే, అతనికి స్వాగతం పలకడానికి వచ్చిన జన సందోహం టి.వి. లో చూసిన మహేష్ కు పి.ఎల్ కలవరక పోవడానికి కారణం అర్ధం అయ్యింది. ఆ రోజంతా, ఈ మధ్య ప్రతీ రోజు లాగే, సిద్దార్ద్ మీద, ఆయన పార్టీ, ఫాన్స్ మీద, గంట కో సారి సిద్దార్ద్ చేసే ట్వీట్ ల మీద చర్చలు జరుగుతూనే వున్నాయి. ఇదంతా మహేష్ తో ఆఫీస్ రూమ్ టి వి లో చూస్తున్న పి.ఎల్ "రాబోయే ప్రధాని సిద్దార్ద్. దానికి సందేహం లేదు. ఓ సారి సిద్దార్ద్ ను ఈ సాయంత్రం నన్ను కలువమను", అన్నాడు.

"అలాగే సార్. అన్నట్టు బయప్ప రెడ్డి ఫోన్ చేసాడు. మీకు ఈ జనవరిలో 'పద్మభూషణ్ ' అవార్డు ఇస్తారట. మొదటి కంగ్రాట్స్ నా నుంచే", సంతోషంగా అభినందించాడు మహేష్.

"ఈ అవార్డులదేమి ఉందిలే. చూస్తూ వుండు, సిద్దార్ద్ గెలిచిన తరువాత నాకు 'భారత రత్న' ఇస్తాడు", అన్నాడు పి.ఎల్.

32

సౌత్ బీచ్, ఫ్లోరిడా

డిసెంబర్, 2014

ఆయష , లక్ష్మి  మొదలెట్టిన స్టార్ట్ అప్ కంపెనీ చేరిన తరువాత పని రాక్షసి అయ్యిపోయింది. ఇష్ట మైన పని చేసేటప్పుడు సమయం తెలియదేమో. లక్ష్మి  కంపెనీలో చేరిన మొదట ఉద్యోగి తనే. ఒక పక్క కంప్యూటర్ సెక్యురిటి కి ఇంత వరకు రాని, సాటి లేని ప్రొడక్ట్స్ మార్కెట్ కు తేవడానికి ప్రయత్నిస్తు, లక్ష్మి  ఈ మధ్యనే అందించిన డేటా ను అనలైజ్ చేయడానికి టూల్స్ మీద కూడా పని చేస్తున్నది.

ఆయష ఇలా పనికి అంకితమై పోవడానికి మరో కారణం అరసు.

అరసు ఇండియాకి వెళ్లిన తరువాత తెగ బిజీ అయ్యిపోయాడు. అదేమో ఆయాష కు అరసు అలా అవ్వడం, ఆశ్చర్యమేయలేదు. రాగ రాగ, ఇద్దరి గమ్యాలు వేరని, కలసి నడవడం కష్టం అని తెలిసిపోయింది.

"ఆయష, అక్కడేమీ చేస్తావు. ఇక్కడికి వచ్చేయి. నువ్వు పని చేసినా, చేయక పోయినా సమస్య లేదు. నాకు కొంచెం టైం ఇవ్వు. మా నాన్న ను ఒప్పించి నిన్ను పెళ్లి చేసుకుంటాను", అని అడిగాడు.

"రావడానికి సమస్య లేదు. ముందు మీ నాన్న ను ఒప్పించు. వచ్చేస్తాను", అంది ఆయాష.

"అర్ధం చేసుకో ఆయాష. మనది మామూలు పెళ్లి కాదు. మన మతాలు వేరు. దానికి తగట్టు మా నాన్న, నన్ను ఇంకో బిజినెస్ మాగ్నెట్ కూతురితో జత చేయాలనే పథకంలో ఉన్నాడు", అని బాధతో అన్నాడు.

"అరసు ఓ విక్టిమ్ లా మాట్లడకు. నీ వంతగా ప్రేమిస్తే, ఆ ఇంగ్లాండ్ రాజు అన్నీ వదిలేసి అమెరికాలో ఉన్న ప్రేయసి దగ్గర పోయినట్లు, నా దగ్గరికి వచ్చేయి. లేక పోతే, రేపు నేనూ ఓ గూగుల్,  అమెజాన్ లా నీ దగ్గరున్న అన్నీ కంపెనీల కంటే కూడా పెద్ద కంపెనీ ని నడుపుతానని నమ్మకం ఉంటే నన్ను ఇక్కడనే ఉండనీ. కనీసం నా కోసం మీ గ్రూప్ లోనే ఓ కంపెనీ ఇక్కడ మొదలెట్టు", అంది.

అరసు సరే అన్నాడు కాని, రాగ రాగ మాటలు తక్కువయ్యాయి. ఈ మధ్య సూపర్ స్టార్ సిద్దార్ద్ కూతురు రీమ తో తిరుగుతున్నట్టు విన్నది.

ఓ రోజు డల్ అనిపిస్తే సలీం తో కబుర్లేసుకుంది ఆయష. సలీంతో అరసు తను విడిపోయినట్లే అని చెప్పింది.

"అదీ ఒకందుకు మంచిదే అయ్యింది ఆయష. నాకు ముందు నుంచే మీ ప్రేమ వర్క్ ఔట్ కావడం కష్టం అని అనిపించింది. ఇన్నిరోజులు చెప్పడానికి కొంచెం వెనుకాడాను. నీకు తెలుసు కదా ఇక్కడ క్యాన్సర్ అని నా దగ్గర వస్తున్న పేషెంట్ల డేటా తో రిసెర్చ్ చేస్తున్నానని. ఈ క్యాన్సర్ కు ముఖ్య కారణం అరసు వాళ్ళ పి.ఎల్.గ్రూపు కంపెనీలె అని నా రీసెర్చ్ చెప్తోంది. నువ్వు అరసును, వాళ్ళ కంపెనీలలో చేరక పోతేనే మంచిది", అన్నాడు సలీం.

"నీతో మాట్లా డి తే నాకెప్పుడూ సంతోషం గాను, ఊరట గాను ఉంటుంది అన్నా. మరిప్పుడే మీ చేస్తావు నువ్వు ఆ రీసెర్చ్ పేపర్ తో", అంది ఆయాష.

"అదే అర్ధం కావటం లేదు, ఆయాష. నేను పనిచేస్తుంది పి.ఎల్.గ్రూప్ ట్రస్ట్ టీచింగ్ హాస్పిటల్. నా పేపర్ చూస్తే , మా డీన్ తానూ భయపడి, చించి పడేస్తాడు. నేను ఈ హాస్పిటల్ బయట పడి కాని పేపర్ పబ్లిష్ చేయలేను. కానీ హాస్పిటల్ వదలాలంటే, ఇది సిటీలో, అంత ఎందుకు దేశంలోనే టాప్ హాస్పిటల్. వదల బుద్ధి కావటం లేదు. నాన్నకు పి.ఎల్. గ్రూప్ హాస్పిటల్ లో చేరుతున్నానంటే నే కోపం వచ్చేసింది. పి.ఎల్. నైజం నచ్చకనే, ఎప్పుడో ఆ రోజులలోనే, పి.ఎల్. తో అభిప్రాయ బేధాలు వచ్చి కంపెనీ నుంచి వైదొలిగితే, తిరిగి అదే పి.ఎల్ గ్రూప్ రొచ్చు లో ఎందుకు దిగుతున్నావు అని హెచ్చరించారు. నేనే ఈ హాస్పిటల్ లో టాప్ డాక్టర్లు, లేటెస్ట్ సదుపాయాలు, టెక్నాలజీ ఉందని నాన్న మాట వినకుండా చేరాను. అయిన నువ్వు దూరంలో ఉన్నావు. మార్గం దొరుకుతుంది లే. నువ్వు దిగులు పడకు", అన్నాడు సలీం.

అది జరిగిన కొన్ని రోజులకు లక్షి "ఆయాష, ఓ ప్రో బోనో పని చేస్తున్నాము కదా. నీవు ఇండియాకి సంబంధించిన డేటా కొంచెం అనలైజ్ చేసి చెప్పగలవా. నీకు అక్కడి కంపెనీలు, మనుష్యులు నా కంటే బాగా తెలుసు. తొందరగా కనెక్ట్ చేయ గలుగు తావు", అంది.

ఆయాష ఆ డేటా చూసి షాక్ అయ్యింది. తెలిసిన ప్రముఖుల తో బాటు పి.ఎల్.గ్రూపు టాక్స్ లు ఎగ గొట్టడానికి, విదేశీ మారక రేగులేషన్ ల క్రింద రాకుండ డానికి, కొన్ని వేల కోట్ల డబ్బు ఈ ఆఫ్ షోర్ కంపెనీలలో పెట్టారు. ఈ విషయం బయటకి తెలుస్తే పి.ఎల్ గ్రూప్ మట్టిగొట్టుకొని పోతుంది. పి.ఎల్., అరసు ఇద్దరూ జైల్ పాలు అవ్వుతారు. అలానే సిద్దార్ద్, రీమాలు.

డేటా లో పాకిస్తాన్ కూడా అనలైజ్ చేసింది. ఆ దేశంలో ప్రధాన మంత్రి కూడా ఇలాంటి లావా దేవిలు చేయడం ఆయాష కు మరో షాక్. తను కనుకున్న విషయాలు, లక్షి తో పంచుకుంది ఆయాష.

లక్ష్మీ కి విశ్వం తో మాట్లాడాలి అని అనిపించింది. తను అంత వరకు కనుకొన్న విషయాలు విశ్వంతో చెప్పి,

"మీరన్నది నిజమే అనిపిస్తుంది. ప్రభుత్వ చట్టాలు నేరాలు జరిగిన తరువాతి గుణపాఠాలే ఇప్పుడు బయట పడే డేటా వాళ్ళ ఎన్ని కొత్త చట్టాలు వస్తాయో.

పాకిస్తాన్, ఐస్ ల్యాండ్ ప్రధాన మంత్రుల పేర్లు తెలినాయి. మొత్తం డేటా పరిశీలించడానికి నా దగ్గర అంత జనం కూడా లేదు. ఎదో పిరమిడ్ గ్రూప్ గురించి మీకోసం వేదికితే, తీగ జరిపితే డొంకంతా కదిలినట్లు, ఈ పెద్ద వాళ్ళ పేర్లు బయట పడ్డాయి. ఏమి చేయాలో తెలియటం లేదు", అంది లక్షి .

విశ్వం కు కూడా ఈ సమస్య జరిలంగానే తోచింది. ఇలాంటి డేటా ఉంది అని తెలిస్తే లక్షి జీవితానికే ప్రమాదం. ఈ డేటా తో డబ్బులు చేసుకోవచ్చు. కాని అది లక్షి లాంటి సామాన్యులకు రాని పని. సామాన్యులన్న మాట మెదిలిన వెంటనే, విశ్వం కు ఫోర్త్ ఎస్టేట్ పదం మనస్సులో మెదిలింది.

"నువ్వు ప్రెస్ వాళ్ళని సంప్రదించి చూడు. వాళ్లే ఇలాంటి, ప్రభుత్వాలు కూల్చే సమాచారం ప్రజలకు అందజేయ గలరు", అన్నాడు విశ్వం.

లక్షి కొద్దీ సేపు మౌనం తరువాత ,"అదే సరి అనిపిస్తుంది నాన్న. అన్నట్టు మీ ఆరోగ్యం ఏలా ఉంది. మీకు ఎప్పుడు రెడీ అనిపిస్తే అప్పుడు నా కంపెనీలో సలహదారునిగా చేరండి నాన్న. మీకున్న బ్యాంక్, ఆర్ధిక రంగంలో ఉన్న అనుభవం మాకు తప్పక ఉపాయోగ పడుతుంది", అన్నది.

"అన్నట్టు చెప్పడం మరిచాను. గుడ్ న్యూస్ బంగారు. నా పి ఎస్ ఏ రిపోర్ట్ వచ్చింది. జీరో రీడింగ్, అన్ ట్రేసబుల్ అని వచ్చింది. ఆపరేషన్ మొత్తం కాన్సర్ ని తీసేసినట్లే. లోకం కొత్తగా అనిపిస్తుంది. తప్పకుండా ఇంకో నెలలో నీ కంపెనీ చేరుతాను", ఆనందంగా పుత్రికోత్సాహం తో అన్నాడు విశ్వం.

లక్షి కి మార్గం నిర్ధారణ అయ్యిన తరువాత, ఏ పేపర్ కి పంపించాలి? అన్న ప్రశ్న ప్రత్యక్ష మైంది. తను ఉంటున్న అమెరికా, ఆయాష వచ్చిన భారత దేశం లోని వారిని కాంటాక్ట్ చేయడం తమకే ప్రమాదం. ఐరోపా దేశాలు సేఫ్ అనుకుంది లక్షి .

33

వాయిస్ ఓవర్ ఐ పి

ఏప్రిల్ , 2015

జర్మనీలో ఓ ప్రముఖ పేపర్ ఆఫీస్ లో ఓ జర్నలిస్ట్ టేబిల్ పైన ఫోన్ మ్రోగింది. ఫోన్ ఎత్తాడు జర్నలిస్ట్.

"నేను జేన్ డో మాట్లాడు తున్నాను. నా దగ్గర డేటా ఉంది. మీరు ఇంటరెస్టెడా ?...", మాట్లాడడం మొదలెట్టింది లక్షి .

( మనలో మాట:

- 2016 లో ICIJ అన్న అంతర్జాతీయ జర్నలిస్టుల సముదాయం వల్ల 'పనామా పేపర్లు' బయట పడడం నిజం.
- ఈ పేపర్ల వల్ల గొప్ప వారు గా చలామణి అవ్వుతున్న పెద్దల తాము అక్రమంగా సంపాదించిన డబ్బులు ఎక్కడ దాచారో అన్నది బయట పడడం నిజం.
- ఈ 'పనామా పేపర్లు' బయట పడటానికి 'జాన్ డో' అన్న అనామకుడు, పనామా లాయర్ల కంప్యూటర్ల నుంచి డేటా సంగ్రహించి, జర్మనీ లో అంతకు ముందే టాక్స్ ఫ్రాడ్ చేస్తున్న వారి గురించి వ్యాసాలు రాసిన పత్రిక ,సూడ్ డాయిట్చ్ జైటుంగ్'(Suddeutsche Zeitung)కు ఫోన్ చేసి, ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా, డేటా అంద జేయడం నిజం. అటు తరువాత ఆ జైటుంగ్ పత్రిక, అంతర్జాతీయ జర్నలిస్టులతో కలిసి రహస్యంగా, సంవత్సరం పైన ఆ డేటా ను పరిశీలించడం నిజం.
- ఇలాంటి నేరాలు అరికట్టడం కష్టం అన్నదానికి నిదర్శనంగా మరిన్ని పెద్దల పేర్లు 2021 లో 'పాండోరా పేపర్లు ' ద్వారా బయట పడడం నిజం

అంతర్జాతీయంగా ఎంతో పేరు, ప్రతిష్ఠలు ఉన్న శక్తిమంతులను ఇంకా వణికిస్తున్న దానికి కారణమైన, ఈ 'జాన్ డో' ఎవరు అన్న ఆలోచనతో రాసిన కాల్పనిక నవల ఇది

కాబట్టి ఇందులోని పాత్రలు, సన్నివేశాలు పూర్తిగా కల్పితమే. ఏవైనా పోలికలు కనిపిస్తే అవి పూర్తిగా యాదృచ్ఛికమే )

*(సమాప్తం)*

Post your comments